కథానిక :

# పరివర్తన...

రచయిత్రి :
కె. యస్. లక్ష్మి.

ఆ వివాహముఅంతా అదోయిదిగా జరిగిపోయింది. "ప్రస్తుతపు నవీననాగరికతా పద్ధతులు ప్రకారం, పిల్లను పిల్లవాడు-పిల్లవానిని, పిల్ల చూచుకోవటం. నచ్చినపిమ్మట కట్నకానుకలు నిర్ణయించుకొనిన పిమ్మట జరుగకపోవటం ఆశ్చర్యంగావుంది."

మగపెళ్లివారి తరపు చుట్టాలు, పక్కాలు ఓవిధంగా విచారం, అక్కసు వెళ్లగ్రక్కేరు. ఏమంటే? ఆడపెళ్లివారి వద్దనుంచి "గానుగలో చెరకుముక్కను రసంఅంతా పిండి పిప్పిఅయేకా ఏవిధంగా అవతలుపార వేస్తారో అలాగే కట్నకానుకలమిషతో పెళ్ళికూతురు తల్లి దండ్రుల వద్దనుంచి వారికివున్న ఆస్తినిపీల్చి పిప్పిచేసి, పెళ్లయిన మరునాడే రాగిచెంబు తెల్లగాతోమించి, వీధివీధి తిరుగుతూ, భ వ తీ భి క్షాం దే హి అంటూ పొట్ట చేతపుచ్చుకొని పంపించకపోవటయే. ఓ ముఖ్యకారణం"

పిల్లాలేదన్నా 5 ఎకరముల మా గా ణీ, 5, 6 వేల కట్నం, ఆడపడుచులాంఛనాలు, వెండిచెంబులు, పట్టుధోవతులు, యిస్తూ అచ్చట ముచ్చటా జరుపుతూ మా పిల్లనిస్తామంటే మా పిల్లనిస్తామని అనేకమంది ఎగపడినా అవన్నీ తోసిరాజని ఏదో సా మా న్య కుటుంబీకుడయిన కిష్టయ్యపంతులు కుమార్తె శారదను చేసుకున్నందుకు హేళనగా చూశారుకూడా.

నరసయ్యగారూ ఓపక్షాన వదిలేవాడుకాదు కాని కథ అడ్డం తిరగటంవల్ల అలా చెయ్యక తప్పిందికాదు. ఏ పది మంది వున్నారు నాకుమాత్రం, అసలు పెళ్ళికి వప్పుకొని పెళ్లిచేసుకుంటేచాలు, అదే పదివేలు అని సరిపెట్టుకుని కట్నం లేకపోయినా కుమారుడు వప్పుకున్నాడుకాదా అని, అతితొందరలో సలక్షణంగా వివాహం జర్గటం, అంతా ఒక కలలా జరిగిపోయింది.

వాసు ఎప్పుడూ ఏకాంతంగాయుంటాడు పిచ్చివానిలా. ఓ స్నేహితులు, ఓసినిమా మొదలయిన సరదాలు ఏమీలేవు. యిదంతా చూస్తే నరసయ్యగారికి ఒక విధమైన భయానికి దారితీసింది. దాంతో పెళ్ళి ప్రయత్నాలు సాగించేడు. అతనికి మరింతబాధను తెచ్చిపెట్టింది. ఒక్కలెక్కని రెండు సంవత్సరాలు విధివిరామం లేకుండా పెళ్ళివారు రావటం జరిగింది. ఆఖరుకు తండ్రి నిర్బంధించి అడిగాడు. ఒక్కపిల్లా నచ్చకపోతే ఏలాగు? అని. నాకు వివాహంచేసుకోవాలని లేదు. ఏంచెయ్యమంటారు? అని తనమనస్సులోనిది తండ్రికి ఎరుకపరచేడు. నరసయ్యగారికి భయాశ్చర్యాలు వేశాయి. "యిదేమిట్రా? అప్పుడే యింత వైరాగ్యంపూనేవు? నీకేమిబాధ కలిగిందని."

ఏమిటో! అబాధ "యి ది" అని వ్యక్తపరచలేకపోయాడు. "వాసు" మనస్సులోలేని కోర్కెలను, రాని ఆశలను రేకెత్తించుకొని పెద్దలకోసం పెండ్లిచేసుకొని నెత్తిన పెట్టుకోవటం సుఖానన్న ప్రాణిని దుఃఖానికినెట్టుకుపోయి ఆమె విచారిస్తోంటె ఆమెవిచారం తనమూలంగా కదాయని మథనపడటం మొదలయిన రాద్ధాంతం సిద్ధాంతములు జరుగకుండా తనమనసులోమాట చెపితే తీరిపోతుందికదా యని అనుకున్నాడు. కాని తండ్రి అలా వదలలేదు. ధర్మపన్నాలు ఏకరువు పెట్టాడు. "అపుత్రస్య గతిర్నాస్తి పుత్రులులేనివారికి గతులులేవని అవిధాన వేదాలు ఘోషిస్తుయుంటే నీవు యిలా అంటావేమిరా? ఒక్కగాని ఒక్కకొడుకువు. ఏదో నీవల్ల వంశం అభివృద్ధిలోకి వస్తుంది. సిరిసంపదలతో తులతూగుతుంటే చూచి ఆనందిస్తా. మన ఆర్యసంప్రదాయం జ్ఞాపకము తెచ్చుకో. ఆ మృకండుమహర్షి సంతానముకోసం వంశాంకురంకోసం ఎంత శ్రమపడ్డాడు మహానుభావుడు అయిన మార్కండేయుని కని ఒకసుపుత్రునివలన ఈశ్వరానుగ్రహం సంపాదించి చిరస్థాయిగా ఎంతకీర్తివంతుడయేడు. చూడునాయనా! వాసు సలక్షణంగా వివాహం చేసుకొని వంశాన్ని వుద్ధరించు" అని తండ్రి క్రమంగా బేలవలె కంటనీరు పెట్టటంతో భవిష్యత్తుమాట మరచి పెండ్లికి వప్పకొని తండ్రికి సంతృప్తి కలిగించేడు వాసు!

వాసుకు మిత్రబృందం ధన్యవాదాలు సమర్పించేరు. ఏమంటే వరకట్నాలు ప్రబలిన యీరోజుల్లో చిల్లికానీకూడా కట్నంగా తీసుకోనందుకు. కాని స్నేహితుల ధన్యవాదాలు వాసుకు తృప్తినివ్వలేకపోయాయి. పెండ్లి అయింది అన్న సంతోషరేఖలు అతని ముఖంలో ఏ కోశానా కన్పించలేదు.

సం సా ర సాగరంలో పాదంపెట్టి కష్టనిష్ఠురాలు సహించవలసిన దినం ఆరోజే ప్రారంభమేనం కాబోతుంది. కనులవైకుంఠంగా అమర్చేరు. ఆగది పందిరిమంచం, దానికి దోమతెర ఒకప్రక్క డ్రాయరు దానిమీద లతలతో పొదగబడిన గుడ్డ, వాటిమీద పలుకరముల పిండివంటలు, రకరకాల సెంట్లు, కమ్మనివాసనలు విరజిమ్ముతున్నాయి. అర్ధాంగి "శారదను" గదిలోనెట్టి తలుపులు పైనవేశారు.

సంభాషణకు ఎలా వుపక్రమించాలో బోధపడక కొంచెం తికమకలు పడ్డాడు వాసు. మళ్లాకాస్త దిట్టపరుచుకొని తనకేమీ పట్టనట్టుగా గోడమీద వ్రేలాడుతూయున్న రాధాకృష్ణుల పోటోవంక దృష్టిసారించి చూస్తున్నాడు తదేకధ్యానంతో. నిశ్శబ్దాన్ని చీల్చుకుంటూ టిక్.టిక్. మనేశబ్దంతో డ్రాయరుమీదనున్న అలారంపీసు తన విధ్యుక్తధర్మాన్ని నెరవేరుస్తున్నది. చూస్తుండగా గంటకాలం గడిచిపోయింది. గదిగుమ్మంవద్ద గుసగుసల సవ్వడితో మేల్కొని గుమ్మంకేసి దృష్టిసారించాడు వాసు. శా ర ద ఓమూలగా పొంచివుంది.



ముఖం ఆవైపుకు త్రిప్పుకొని నిలబడిఉంది. దగ్గరకువెళ్ళి ఆమెను తనవైపుకు త్రిప్పుకుంటూ మొఖం చూచేడు. ఆశ్చర్యం! సుఖంగా ఆనందడోలికలపై తేలియాడవలసిన ఆమె కంటనీరు పెట్టుటకు కారణమేమిటో అతనికి బోధపడలేదు. యీజీచైరులో కూర్చుని తనప్రక్క అమెను కూర్చుండ పెట్టుకుంటూ శారదా! ఎందుకు విచారిస్తున్నావు అని బుజ్జగించి సాదరంగా ప్రశ్నించేడు వాసు.

"క్షమించండి నావల్ల మీకు తృప్తినివ్వలేక పోయినందుకు విచారిస్తున్నాను. నాప్రేమమూర్తి 'అనంద్' అతనిని ప్రేమించి అతనితో వివాహం చేసుకుందామనుకున్నా. కాని విధివిలాసము ఈ విధముగా జరిగింది. మీ మనస్సు బాధ పడుతుందని చెప్పడానికి సంశయించా - కాని - చెప్పక తప్పిందికాదు. మన్నించినట్లైతే నన్ను పెండ్లిచేసుకున్నందుకు బ్రతికినంతకాలం మీ సేవచేసుకుంటూ మీ రుణం మళ్ళించుకుంటా" అని ప్రార్థించింది శారద. వాసుగుండెల్లో ఒకపాండవముతీసి పారవేసినట్లైంది. హృదయం తేలిక పడింది. ఆగ్రహానికిబదులు అనుగ్రహమే కల్గింది అతని కామెయడ, కుర్చీలోంచి పైకిలేస్తూ " నాకభ్యంతరము లేదు. నీ హృదయేశ్వరుని చేరుకో ఆనందముతో పంపుతా" నన్నాడు. అది కోపమో, ఆదరమో చెప్పలేము. ఆమె రెండుకాళ్ళు పట్టుకుంది. మన్నించండి ఎక్కడకూ వెళ్లను. మీవద్దనే యుంటా-కాని-నన్ను.........

సరే నీవు ఎక్కడవున్నా యిష్టమె నావల్ల నీ మానానికి ఎటువంటిహాని కల్గదు: అని మంచమెక్కాడు నిర్మల మనస్సుతో. ఆమె చాపపై సుఖనిద్ర చెందింది.

*　　　*　　　*

కాలచక్రం మహావేగంతో పరుగిడుతోంది. శారద అత్తవారింటికి కాపురానికి వచ్చింది. రోజులు జర్గిపోతూన్నాయి.

యిప్పుడు సరసయ్యగారి ఆనందానికి అంతులేదు. తాను తలచినట్లు నేటికీ కొడుకూ-కోడలు నట్టింట సుఖంగావుండి కాపురం చేసుకుంటున్నారు కదాయని; శారదకూడా సంతోషంతో కాలాన్ని నెట్టివేస్తూంది. తనభర్త తనపట్ల కారీన్యతబూని మానాన్ని తన స్వార్థపరత్వము కోసం బలిపెట్టతలంపక తనయెడ సరళ హృదయంతో తన ఆత్మస్వాతంత్ర్యానికి అవరోధం కల్గించక పోయినందుకు తన హృదయంలో ప్రతీరోజూ అతనికి "ధన్యవాదాలు" సమర్పించుకుంటూనే యుంది;

వాసు అనుకొన్నట్లుకాక చీటికీ మాటికి విసిగించక ఆమె మానాన్ని ఆమె వెడుతూ యున్నందుకు సంతోషాన్నే కల్గించింది. కాని వంటరిగా రాత్రులందు గదిలో పరున్న సమయంలో "మిసమిసలాడే నవయవ్వనంతో" తొళికిసలాడే భార్యముఖకమలము అవయవముల సొంపుచూచినప్పుడు ఏదో తెలియని బాధ ఆందోళనలతో అతనిబుర్ర ఉద్రిక్తపర్చేది. కాని వెంటనే కోలుకుని బలవంతపు క్రియకు అతని మనసొప్పక ఆ ఆలోచనల దూరముగా తరమటం కూడ అనేకసార్లు జరిగింది. పూర్వపు సిద్ధాంతాలకు యిప్పటి ఊహలకు కలిగిన "మార్పు"కు ఆశ్చర్యానికి దారితీసేది.

వాసు ఓనాడు ఆఫీసునుంచి రావటంతోనే తిన్నగా గదిలోకిపోయి మంచం ఎక్కాడు.

శారదవచ్చి ప్రశ్నించింది. "పరున్నారేమని?" నిర్దాక్షిణ్యంగా పేలకొడుతూన్న తలపోటుబాధను పైకి వ్యక్త పరచక కొంచెం తలబాధగా వుంది అన్నాడు.

ఆమె అంతరాత్మ ఎందుకో బాధపడింది. అతను చేసిన నేరమేమిటి త్వరపడుమని హెచ్చరించింది. వెంటనే గూట్లోని మందు తీసి, కణతలకు పులిమి కాఫీకి స్టౌ

అంటించి కాఫీపెడుతూ ఆలోచించింది. "వాసు చాలా బుద్ధిమంతుడు, చదువుకున్నవాడు. ఎదుటి మనస్సనుగ్రహించే ఔచిత్యంగల వ్యక్తి. అటువంటి సుస్వభావునియెడ తన ప్రవర్తన......కాదు. అది నాతప్పుకాదు. నాఅనుమతి లేనిదే నా హృదయం తెలుసుకొనకుండా, పెండ్లిచేసిన తల్లిదండ్రులది" అని ధృవపరుచుకొంది. కాఫీ కాయటం అయింది. చల్లారబెట్టి వాసుకు యిచ్చింది.

శారదా అన్నాడు దీనంగా

ఏం ?

నాకోసం నీవు శ్రమపడటం......

పున్నమచంద్రునివలె సహజమైన అతని ఫాలభాగం చూడటంతోనే నూతన ఆశారేఖలు పొడగట్టేయి. కాని ఆ పున్నమచంద్రుని ముఖవదనంలో "ఆనంద్" రూపము మచ్చగా నిల్చి, ఆ చంద్రబింబానికి, ఆ నూతన ఆశారేఖలను కళంకపర్చేది ... ఆప్రేమజంట అంధకారంలోకి యీడ్వపడేది. ఆ అంధకారంలో మునిగి విచారసాగరములో మునిగి బుడగలువేయటం జరుగుతూంది...కాని శారద అతని సపర్యల విధేయతతో చేస్తూనే వుంది. తనపై అతనికి ఉన్న విశ్వాసానికి బదులుగా ఆమెలో కాలంతో పాటు ఒక నూతన అధ్యాయం ప్రారంభమయింది.

ఆరోజు ఆదివారం ఆఫీసుకు సెలవు. తోటిగుమాస్తాలందరు నిర్బంధించటంవల్ల సినిమాకు వెళ్లక తప్పింది కాదు. తానొక్కడూ అయితే అంత బాధలేదు కాని సతీసమేతంగా రావాలని పట్టుపట్టటం, రామం, భాస్కరం సతీమణులతో రావటానికి సిద్ధమవటంతో యింక తనకు తప్పదనుకుని తిన్నగా శారదవద్దకు వెళ్లాడు. సినీమాకు వెడదాం ప్రయాణమవమని చెప్పాడు. శారద అంగీకారంగా తల ఊపింది.

మిత్రులువచ్చి గుమ్మంలో వేచియున్నారు. శారద "సీతాకోకచిలుకలా" అలంకరించుకొని వచ్చింది. అంత వరకు అజ్ఞాతవాసం సల్పుతున్న ఆమె అందచందములు, ఆమె సహజసౌందర్యముకు వన్నె తెచ్చాయి మెరుగుపెట్టినట్లుగా. పశ్చిమ భానుని కిరణములకు ఆమె అంగసౌష్టవం తళతళ మెరుస్తూ ముద్దును గొలుపుతూంది; సకాలానికి హాలువద్ద చేరారు. టిక్కట్లుతీసుకొని కుర్చీలలో ఒకరి ప్రక్క నొకరు వరుసగా కూర్చుని చిత్రంచూస్తూయున్నారు. వాహినీవారి ఫిల్ము అందులో పౌరాణికచిత్రం యోగి వేమన రసవత్తరమైన ఘట్టాలతో తెరమీద కథ నడుస్తూంది.

మోహనాంగినాట్యంచేస్తూంది. వేమన పాడుతున్నాడు. డ్యాన్సు అయింది. అలసిన శరీరాన్ని ప్రియుడైన వేమన ఒడిలో దాచింది. ప్రేయసి శారద శరీరం గగుర్పొడిచింది. చటుక్కున ఒళ్ళుతెలియని ఆనందంలో తనచేతిని ప్రక్క చేరులోవున్న వాసుమెడమీదవేసి అతని ముఖం తనముఖం మీదకు లాక్కుంది. ఆప్రక్కచేరులోవున్న రామం భార్య సుజాత సిగ్గుతో తలవంచుకొంది; చిరునవ్వుముఖంతో వాసు శారదమొఖంలోకి చూచాడు; తప్పుచేసినదానిలా నాలిక కరచుకొంది. శారద నీరసంగా చెయ్యలాక్కుని దృష్టి మరల్చి నేలకేసి చూచింది.

"ఇంటర్వల్" అయింది లైట్లు వెలిగాయి. జనం మొహంలోకి చూడటానికి సిగ్గుపడింది. మౌనంతోనే ఎట్లో కాలం గడిపింది. ఆట పూర్తిఅయింది. యింటికి చేరారు.

రోజులు పరుగెడుతున్నాయి. పగలెల్ల కష్టపడిన హాళికులు యిండ్లకు చేరుతున్నారు. కాని మార్పులకాలం కల్పిస్తోంది. సూర్యునీరెండెలు తేజోవంతంగా ప్రకాశిస్తున్నాయి.

నాల్గు మూలలా పసుపుబొట్లు పెట్టబడిన కవరు ఉత్తరంయిచ్చి వెళ్లిపోయాడు పోస్టుమ్యాన్. ఎక్కడనుంచా అని ఆతృతగా విప్పిచూచింది. "పెండ్లిపిలుపు" అన్న పెద్ద అక్షరాలు ఆమె దృష్టి నాకర్షించాయి. ఎవరికా అని ప్రక్కకు తిప్పింది. "ఆశ్చర్యం" తాను మనసార ప్రేమించిన ఆనంద్ పెండ్లి. అదే పదిసార్లు చదివింది అవును... ఆశ్చర్యం! దేనికి? తనకిమల్లేనే ఆతనూ వివాహంచేసుకుంటున్నాడు. కండ్లు చెమ్మగిల్లాయి విచారించింది. ఆనాడు తన తండ్రి యీపెండ్లి స్థిరపరచినప్పుడు, తను "వాసు"ని ప్రేమించలేదని చెప్పలేకపోయింది. తండ్రి అన్న గౌరవం చేతనో లేక తండ్రి మనసు విసిగించి నొప్పించటం యిష్టం లేకనో ముగ్ధభావంతో పిచ్చిదానిలా ఆమోదించింది. కాని మనసారా ప్రేమించిన ఆనంద్‌ను పొందలేకపోయాననే అన్న విచారంతో దిగులుపడి మనసు దగ్ధపరుచుకొని, ప్రస్తుత భర్తఅయిన వాసు, తన ప్రాణానికి ప్రాణంవలె అమిత గౌరవం ప్రేమతో చూచిన వాసును తిరస్కరించింది. నాముగ్ధభావం ఎంతటి తీవ్రపరిణామరూపం దాల్చిందో ఊహించుకొంది. సుఖంగా భర్తతో కాపురంచేసుకొంటున్నా ఆనంద్‌ను ప్రేమించి అతనికి అర్పితంచేసింది. ఇప్పుడు "రెంటికీ చెడ్డ రేవడి అయింది తన జీవితం" అని భావించింది. గోలుగోలున ఏడ్చింది. "హృదయపరివర్తన కల్గింది."

శారదా అన్న పిలుపుతో మొహం పైకెత్తి చూచింది. రెండు చేతులలోను తనముఖంపెట్టుకు ఏడ్చింది. క్షమించమని "వాసుని" వేడుకొంది.

ఏమిటి? శారదా మన్నించటం దేనికి? ప్రశ్నించాడు వాసు. యిదిగో యీవుత్తరం చూడండి చేతికి అందించింది. ఉత్తరం చూచాడు. సర్వం గ్రహించాడు. యీమాత్రానికి మన్నించటం దేనికి ?

వారి జీవితచరిత్రలో పరివర్తనకల్గింది. నూతన శకారంభం అయింది ఆనందమయంగా సంసారయాత్ర సాగిస్తున్నారు. మిత్రుని పెండ్లికి వెళ్లి, పెండ్లిచేయించి వచ్చారు. ఆనంద్ ఆ దంపతబృందానికి ధన్యవాదాలు అర్పించాడు.

నాటి శారద నేడు మాతృస్థానాన్ని పొందగలిగింది. యిప్పుడు నరసయ్యపంతులుగారి ఆనందానికి అంతులేదు.